




# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 257

పేజీలు : 4 వెల రూ.4/-

Circulated by : Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

గురువారం 26 ఫిబ్రవరి 2026


# రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు బ్లూప్రింట్

- ఈ ఏడాది జూలైకి వెలిగొండ తొలిదశ పూర్తి చేసి నీళ్లు
- మార్కాపురం జిల్లాతో దశాబ్దాల కల సాకారం.. రూ.50 కోట్లతో కలక్టరేట్
- జిల్లా ఏర్పడ్డాక తొలిసారి వెళ్లిన ముఖ్యమంత్రికి అపూర్వ స్వాగతం
- గత పాలకులు ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితమిచ్చేశారు
- వెలిగొండపై వైసీపీ డ్రామాలను ఎండగట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- రూ.456 కోట్లతో వెలిగొండ ఫీడర్ కెనాల్ పనులకు సీఎం శంకుస్థాపన
- మార్కాపురం జిల్లా కళ, వెలిగొండ కళకళ బహిరంగ సభా వేదికలో సీఎం

**మార్కాపురం,కలంకౌంటర్ :** ఈ ఏడాది జూలై నాటికి వెలిగొండ తొలిదశ పూర్తిచేసి మార్కాపురం జిల్లాలోని ప్రతి ఎకరాకు సాగు నీరందిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. గత పాలకుడిలా ప్రాజెక్టు పూర్తి కాకుండానే జాతికి అంకితమంటూ రిబ్బన్ కటింగ్లు చేసి దొంగ నాటకాలు ఆడటం తమకు చేతకాదని సీఎం వ్యాఖ్యానించారు. వెనుకబాటుకు గురైన మార్కాపురం ప్రాంతాన్ని కొత్త జిల్లాగా ఏర్పాటు చేస్తామన్న హామీని నిలబెట్టుకున్నామని సీఎం అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతీ ఎకరాకూ నీరివ్వాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని వెల్లడించారు. దీనికోసం విశ్రాంత ఇంజనీర్లతో ఓ బృందాన్ని వేసి అధ్యయనం చేయి-ుస్తామని తెలిపారు. ప్రతీ ఎకరాకూ సాగునీరు ఇచ్చే అంశంపై బ్లూ ప్రింట్ తయారు చేస్తామని అన్నారు. మార్కాపురం జిల్లా దోర్నాల మండలం గంటవాని పల్లెలో రూ.456 కోట్లతో వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. రైతులతో కలిసి పనులను పరిశీలించారు. అనంతరం మార్కాపురంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి



ప్రసంగిస్తూ...'గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంసం జరిగింది. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి ప్రజలు 94



శాతం స్ట్రైక్ రేటు ఇచ్చారు. అరకు మొదలుకొని ప్రకాశం వరకూ మంచి విజయం అందించారు. మొన్నటి సార్వత్రిక ఎన్నికల్లో మార్కాపురం, మదనపల్లి, పోలవరం ప్రాంతాలను జిల్లాలు చేస్తానని మాట ఇచ్చి ఇప్పుడు నిలబెట్టుకున్నాను. ఇక్కడి ప్రజలు 150 కిలోమీటర్లు ప్రయాణించి ఒంగోలు కు వెళ్లాల్సిన పని లేకుండా మార్కాపురాన్ని జిల్లా చేశాను. అన్యాయం జరిగిన మదనపల్లికి న్యాయం చేశా' అని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.


**శంకుస్థాపనతో పాటు ప్రారంభించే అవకాశం నాకే వచ్చింది..**

1996,మార్చి 5న ఈ ప్రాంతంలో నేను పర్యటించినప్పుడు ప్రజల కష్టాలు కళ్ళారా చూశాను. శ్రీశైలం నుంచి నీరివ్వమని ఇక్కడి ప్రజలు నన్ను కోరారు. ఆనాడు వెలుగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించాం. భగవంతుడు మళ్లీ నాకే అవకాశం ఇచ్చాడు. వెలుగొండను పూర్తి చేసి మీ జీవితాల్లో వెలుగులు తెస్తాను. రైతులను ఆదుకుంటాం. 2014-2019లో ప్రాజెక్టు పనులు పరుగులు పెట్టించాం. ఈ ప్రాజెక్టు ద్వారా 4.35 లక్షల ఎకరాలకు సాగు నీరు అందించడమే లక్ష్యం. దీని వల్ల గిద్దలూరు, మార్కాపురం, ఎర్రగొండపాలెం, కనిగిరి నియోజకవర్గాలకే కాకుండా ఉదయగిరి, కడప జిల్లా బద్వేలుకు కూడా నీరు

- 3లో

# రాష్ట్ర భవిత మీరే..చరిత మీదే

- అమ్మలాంటి తెలుగు భాషను మరవొద్దు
- అసెంబ్లీ లాబీలో విద్యార్థులతో విద్యా మంత్రి లోకేష్ సంభాషణ



**అమరావతి,కలంకౌంటర్ :** పిల్లలే రాష్ట్ర భవిత అనీ, రాబోయే కాలంలో చరిత్ర సృష్టించేది నేటి విద్యార్థులేనని, ఇంగ్లీషులో చదువుకుంటున్నా, అమ్మలాంటి తెలుగుభాషను మరువొద్దని విద్యా మంత్రి నారా లోకేష్ సూచించారు. అసెంబ్లీ చూడటానికి బుధవారం వచ్చిన సత్తెనపల్లి నియోజకవర్గం సుగాలి జెడ్పీ హైస్కూలు విద్యార్థులతో లాబీలో మంత్రి మాట్లాడారు. -అసెంబ్లీ చూడటం ఎలా వుంది? మీరు చూస్తున్నప్పుడు అసెంబ్లీలో ఏ అంశంపై చర్చ జరిగింది?- అని ప్రశ్నించారు. అసెంబ్లీ కార్యకలాపాలు ప్రత్యక్షంగా చూడటం వల్ల చాలా విషయాలు తెలిశాయని, తాము చూసిన చర్చను లోకేష్‌కు వివరించారు. కెరీర్, ఎడ్యుకేషన్ కోసం ఇంగ్లీషులో నైపుణ్యం కనబరుస్తూనే.. మాతృ భాష తెలుగును మర్చిపోవద్దని పిల్లలకు హితబోధ చేశారు. విదేశాల్లో ఎక్కువ కాలం చదువుకోవడం వలన మొదట్లో తెలుగు రాక తాను ఇబ్బంది పడిన విషయాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. ప్రభుత్వం ఇస్తున్న యూనిఫామ్ ఎలా ఉంది? టీచర్లు పాఠాలు ఎలా చెబుతున్నారు? మధ్యాహ్నం భోజనం రుచిగా ఉంటుందా? రాగిజావ అందుతోందా? అని అడిగి తెలుసుకున్నారు.



# విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొన్న వైయస్ జగన్





**పులివెందుల,కలంకౌంటర్ :** వేంపల్లె మండలం నందిపల్లిలోని శ్రీ నందీశ్వర ఆలయంలో నిర్వహించిన నూతన విగ్రహ ప్రతిష్ఠ (శ్రీ పార్వతీ దేవి సమేత మహా నందీశ్వర స్వామి వారు), కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమంలో మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్సీపీ అధినేత వైయస్ జగన్ పాల్గొన్నారు. ఆలయ అర్చకులు, వేదపండితులు నిర్వహించిన ప్రత్యేక పూజలు, హోమాల్లో సంప్రదాయ దుస్తులు ధరించి పాల్గొని, స్వామివారికి భక్తిశ్రద్ధలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల ఆశీర్వచనం స్వీకరించారు. ఈ సందర్భంగా




# ఆర్తులకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

- అన్నార్థులకు చేయూతనిస్తున్న ఏపీ సీఎం చంద్రబాబు
- చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు
- బాధిత కుటుంబాలకు సుమారు 6 లక్షల విలువచేసే చెక్కులను అందజేసిన చిత్తూరు పార్లమెంటు సభ్యులు
- కృతజ్ఞతలు తెలియజేసిన బాధిత కుటుంబ సభ్యులు



**చిత్తూరు,కలంకౌంటర్ :** ముఖ్యమంత్రి సహాయనిధి ఆర్తులకు అండగా నిలుస్తోందని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నార్తులకు చేయూతనివ్వడం అభినందనీయమన్నారు. సుమారు ఆరు లక్షల రూపాయలు విలువ చేసే సీయంఆర్ఎఫ్ చెక్కులను పది బాధిత కుటుంబాలకు చిత్తూరు ఎంపీ కార్యాలయంలో చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు అందజేసి, వారిలో స్థైర్యాన్ని నింపారు. ఈ సందర్భంగా చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు మాట్లాడుతూ.. ఉన్నత ఆశయంతో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని కొనియాడారు. పేదరికం లేని సమాజ స్థాపినే సంకల్పంగా ముందుకు సాగుతున్నారని చెప్పారు. ఇందులో భాగంగానే పలు వ్యాధులతో బాధపడే వారికి, ప్రాణాలు కోల్పోయిన బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందుకుంటూ, వారిలో స్థైర్యాన్ని కోల్పోకుండా ఉండటానికి తగు జాగ్రత్తా చర్యలు తీసుకుంటున్నారని ఆయన తెలియజేశారు. ఇది మ-ఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడి పాలనా దక్షతకు నిదర్శనమని సీఎం సేవలను ప్రశంసించారు.

# ఎమ్మెల్యే కృషితో మోపిదేవి నుండి వెంకటాపురంరోడ్డు నిర్మాణం

- ధన్యవాదములు తెలిపిన మోపిదేవి పిఎసిఎస్ అధ్యక్షులు పరుచూరి శ్రీనివాసరావు
- "పల్లె పండుగ" కార్యక్రమం ద్వారా రూ. 97 లక్షలతో నూతన రోడ్డు నిర్మాణం



**మోపిదేవి,కలంకౌంటర్ :** కూటమి ప్రభుత్వ సహకారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రత్యేక శ్రద్ధతో అవనిగడ్డ నియోజకవర్గం మోపిదేవి మండలంలో అనేక గ్రామాల ప్రధాన రహదారులు అభివృద్ధికి నోచుకుంటున్నాయి. తాజాగా మోపిదేవి ప్రధాన సెంటర్ నుండి రావివారిపాలెం మీదగా వెంకటాపురం వరకు ప్రధాన రహదారి నిర్మాణం 97 లక్షలు నిధులు మంజూరు చేసినందుకు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రత్యేక శ్రద్ధతో చేసిన కృషితో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో తమ పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంజూరు చేసినందుకు . కూటమి ప్రభుత్వంలో తమ ప్రధాన రహదారి సమస్య పరిష్కారం అవుతున్నందుకు మోపిదేవి పిఎసిఎస్ అధ్యక్షులు పరుచూరి శ్రీనివాసరావు గ్రామస్తులు తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ రహదారి ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని మోపిదేవి దేవస్థానం కు వచ్చిన భక్తులు పెద్దకల్లేపల్లి వెళ్లేందుకు ఈ రహదారి వెంటే వాహనాలతో ప్రయాణం చేస్తున్నారని ఎంతోకాలంగా ఈ రహదారి చాలా అధ్వాన పరిస్థితుల్లో ఉండేదని వర్షం పడినప్పుడు రావివారిపాలెం వెళ్లాలంటే ప్రజలు చాలా ఇబ్బంది పడే వారిని ఈ రహదారి మంజూరు చేసినందుకు శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ గారికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

# మర్యాద పూర్వక కలయిక




**విజయవాడ, కలంకౌంటర్ :** నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరిని మర్యాదపూర్వకంగా గన్నవరం ఎయిర్పోర్ట్ లో కలిసి స్వాగతం పలికిన ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య న్యాయవాదుల సంఘం కన్వీనర్ గంగిశెట్టి రాజేశ్వరరావు, కే శ్రీధర్ మూర్తి తదితరులు.

## విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొన్న వైయస్ జగన్

(మొదటిపేజీ తరువాయి)



ఆయన మాట్లాడుతూ, దేవాలయాలు మన సంస్కృతి, సంప్రదాయాల ప్రతీకలని, భక్తి మార్గం ద్వారా సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం పెంపొందుతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల అభివృద్ధి, పునర్నిర్మాణం ద్వారా ఆధ్యాత్మిక చైతన్యం మరింత విస్తరిస్తుందని తెలిపారు. నూతన విగ్రహ ప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆలయ కమిటీ ఛైర్మన్ మారం శ్రీకాంత్ రెడ్డిని, కమిటీ సభ్యులను అభినందిస్తూ, ఈ కార్యక్రమం గ్రామ ప్రజల ఐక్యతకు నిదర్శనమని అన్నారు. గ్రామ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, శ్రీ నందీశ్వర స్వామివారి కృపాకటాక్షాలు సమస్త ప్రజలపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# జాబ్ మేళాల ద్వారా ఇప్పటివరకు 1.08 లక్షల మందికి ఉద్యోగాలు

- ఇండస్ట్రీ టై అప్ తో స్కిల్ డెవలప్ మెంట్ కార్యక్రమాలకు చర్యలు
- సోలార్ సెల్ మ్యానుఫ్యాక్చరింగ్ పై న్యూ సౌత్ వేల్స్ వర్సిటీతో ఒప్పందం
- న్యాక్ బలోపేతం ద్వారా ప్రపంచస్థాయి భవన నిర్మాణ కార్మికులను తయారుచేస్తాం
- శాసనసభలో రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్



**అమరావతి,కలంకౌంటర్ :** సూపర్ -6లో ఇచ్చిన తొలి హామీ 5ఏళ్లలో 20లక్షల ఉద్యోగాల కల్పన. ఒకేరాష్ట్రం, ఒకేరాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ ప్రజాప్రభుత్వ లక్ష్యం. అందులో భాగంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక క్లస్టర్ బేస్డ్ విధానాన్ని తీసుకొని ముందుకు వెళ్తున్నాం. ఇప్పటికే సుమారు 22 క్లస్టర్లను గుర్తించామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. శాసనసభలో స్కిల్ డెవలప్ మెంట్ కార్యక్రమాలు ఏమేరకు ఆశించిన ఫలితాలు ఇస్తున్నాయి, శిక్షణా కేంద్రాల పనితీరు, ఉద్యోగావకాశాలు, ప్రతిపాదిత నూతన పారిశ్రామిక భాగస్వామ్య వివరాలపై ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ,, యార్లగడ్డ వెంకట్రావు, గోరంట్ల బుచ్చయ్యచౌదరి, వెంకటరాజు అడిగిన ప్రశ్నలకు మంత్రి లోకేష్ సమాధానమిస్తూ... రాయలసీమ, అనంతపురంలలో ఆటోమోటివ్ క్లస్టర్, కర్నూలులో రెన్యువబుల్ ఎనర్జీ, సిమెంట్ క్లస్టర్, కడప, చిత్తూరులో ఎలక్ట్రానిక్ మ్యానుఫ్యాక్చరింగ్ క్లస్టర్, నెల్లూరులో గ్లాస్, ఏసీ క్లస్టర్ వస్తోంది. ప్రకాశం జిల్లాలో కంప్రెస్డ్ బయోగ్యాస్ క్లస్టర్, అమరావతిలో క్వాంటమ్ కంప్యూటింగ్ క్లస్టర్, గోదావరి జిల్లాలో ఆక్వా క్లస్టర్, ఉత్తరాంధ్రలో ఫార్మా, మెడికల్ డివైసెస్ మ్యానుఫ్యాక్చరింగ్, స్టీల్ క్లస్టర్ వస్తున్నాయి. డ్రోన్ సిటీ, స్పేస్ సిటీ కూడా వస్తున్నాయి. ఆయా క్లస్టర్లలో వర్టికల్, హారిజంటల్ ఇంటిగ్రేషన్ చాలా అవసరం. కేవలం బేసిక్ మ్యానుఫ్యాక్చరింగ్ మాత్రమే కాకుండా అనుబంధ తయారీ యూనిట్లు కూడా అదే క్లస్టర్ లోకి తీసుకురావాలన్నది ప్రభుత్వ లక్ష్యం. యాపిల్ మొబైల్ సంస్థ డిజైనింగ్, మార్కెటింగ్ చేస్తుంది. మ్యానుఫ్యాక్చరింగ్ ఫాక్స్ కాన్ చేస్తుంది. అయితే అన్ని కాంపొనెంట్ లను ఫాక్స్ కాన్ తయారు చేయదు. 2వేలమంది సప్లయర్స్ దగ్గర నుంచి ఫాక్స్ కాన్ కాంపొనెంట్స్ కొనుగోలు చేస్తుంది. వారందరినీ ఒక ఎకోసిస్టమ్ లోకి తీసుకురావాలన్నది మా ఆలోచన. మరొకటి గ్లాస్ మ్యానుఫ్యాక్చరింగ్. భారతదేశంలో గ్లాస్ వినియోగం పెరుగుతోంది. ఇందుకు సంబంధించిన పరిశ్రమలను ఒకే క్లస్టర్ లోకి తీసుకురావాల్సి ఉంది. మరొకటి సోలార్ సెల్ మ్యానుఫ్యాక్చరింగ్. వేఫర్ మ్యానుఫ్యాక్చరింగ్ కు సంబంధించి ఉత్తరాంధ్రకు కొన్ని, రాయలసీమకు కొన్ని పరిశ్రమలు వస్తున్నాయి. ఇందుకు సంబంధించి యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ (సిడ్నీ)తో సంప్రదించి ర్యాపిడ్ ప్రొటోటైపింగ్ టెస్టింగ్, డిజైన్ సెంటర్ ను తిరుపతి ఐఐటికి తీసుకురావడానికి కృషిచేస్తున్నాం. క్లస్టర్ విధానంలో వర్టికల్ అంటే వివిధ రకాల కంపెనీలను తీసుకురావడం. హారిజంటల్ అంటే ఎడ్యుకేషన్. అందులో స్కిల్ డెవలప్ మెంట్ కీలకమైన పాత్ర పోషిస్తుంది. కోర్సులను అప్ గ్రేడ్ చేయాల్సి ఉంది. సోలార్ సెల్ మ్యానుఫ్యాక్చరింగ్ కు సంబంధించిన బీ.టెక్, ఎం.టెక్, రిసెర్చ్ ప్రోగ్రామ్ లను ప్రవేశపెట్టేందుకు తిరుపతి ఐఐటి డైరెక్టర్ తో మాట్లాడుతున్నాం. క్లస్టర్ లో టెస్టింగ్, సర్టిఫికేషన్ సౌకర్యాలను కల్పించాల్సి ఉంటుంది. భారతదేశంలో తయారయ్యే వంద ఏసీలలో 50 ఆంధ్రప్రదేశ్ లోనే తయారవుతున్నాయి. భారీ పరిశ్రమల మంత్రి టీజీ భరత్ కృషితో డైకిన్, ఎల్ జీ, బ్లూస్టార్ వంటి కంపెనీలు వచ్చాయి. దీనివల్ల రాబోయే రెండేళ్లలో ఏపీలో ఏసీల ఉత్పత్తి 70శాతానికి పెరుగుతుంది. నేను వాళ్లను కలిసినపుడు ఐటీఐలను తమ యూనిట్లకు అనుసంధానించాలని కోరారు. కరిక్యులమ్, ఎక్విప్ మెంట్ తామే ప్రొవైడ్ చేసి, గైడ్ చేస్తామని, ఎకోసిస్టమ్ అభివృద్ధి చేయాలని చెప్పారు. కీలకమైన హీట్ పంప్ తయారీ, టెస్టింగ్ ఫెసిలిటీ ఇక్కడే ఏర్పాటు చేయాలని కోరారు. యూరప్ పంపి ఒక్కొక హీట్ పంప్ టెస్ట్ చేయడానికి సుమారు 5లక్షల యూరోలు అవుతుంది. అందుకు అవసరమైన ఎకోసిస్టమ్ ను స్థానికంగా ఏర్పాటు చేయాల్సి ఉంది. రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటుచేయడానికి ఎంవోయూ చేసుకున్న 760 పరిశ్రమలను మంత్రుల బృందం ట్రాక్ చేసింది. జీవోఎంలో నాతోపాటు పరిశ్రమల మంత్రి భరత్, విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్, టూరిజం మంత్రి కందుల దుర్గేష్ సభ్యులుగా ఉన్నాం. వారందరితో చర్చలు జరిపి వారికి కావాల్సిన కోర్సులు, మ్యాన్ పవర్ పై మ్యాపింగ్ చేశాం. దీనిపై ఒక్కొక సెక్టార్ కు ఒక్కొక ఇండస్ట్రీ లీడర్ ను గుర్తించి వారికి బాధ్యత అప్పగిస్తున్నాం. సిస్టమాటిక్ గా 22 క్లస్టర్లలో ఎకోసిస్టమ్ అభివృద్ధి చేస్తున్నాం. సుజలాన్ తో మాట్లాడి 5 గ్రీన్ ఎనర్జీ ల్యాబ్ లు ఏర్పాటుచేసి, ఏటా 12వేలమంది టెక్నీషియన్లకు విండ్ ఎనర్జీలో శిక్షణ ఇస్తున్నాం. ఏఐ అడ్వాన్స్ డ్ ట్రైనింగ్ కోసం మైక్రోసాఫ్ట్, ఇన్ఫోసిస్ తో ఒప్పందం చేసుకున్నాం. రాయల్ ఎన్ ఫీల్డ్ ఒక ఐటీఐని ఎడాప్ట్ చేసుకుని వారికి కావాల్సిన సాంకేతికతతో మెకానిక్ లకు శిక్షణ ఇస్తుంది. యువగళం పాదయాత్రలో ఆటో మెకానిక్ లు, టూవీలర్ మెకానిక్ లను కలిశాను. ప్రస్తుతం టెక్నాలజీ అప్ గ్రేడ్ అయినందున కొత్త సాంకేతికతలపై వారికి కావాల్సిన ట్రైనింగ్ అందించడానికి ఇండస్ట్రీతో టై అప్ కావాల్సి ఉంది. ఈ నెలలోనే సెయింట్ గోబిన్స్ తో ఒక ఒప్పందం కుదుర్చుకుంటున్నాం. న్యాక్ లో ఫాల్ సీలింగ్ అండ్ డ్రైవ్ ఆన్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుచేస్తున్నాం. ఆసియన్ పెయింట్స్ ఆధ్వర్యాన మరో సీఓఈ, ఎల్ అండ్ టీ ఆధ్వర్యాన అంతర్జాతీయస్థాయి మ్యాన్ పవర్ పైప్ లైన్ ఏర్పాటు చేస్తున్నాం. అల్ట్రాటెక్, శ్రీ సిమెంట్స్ తో మాట్లాడాం. సిమెంట్ ఎకోసిస్టమ్ లో కూడా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుచేసేందుకు కృషిచేస్తున్నాం. ప్రతి నియోజకవర్గంలో 3నెలలకు ఒకసారి జాబ్ మేళా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకు 1587 జాబ్ ఫెయిర్లు నిర్వహించగా, 11,373 కంపెనీలు పాల్గొని 1,08,747 మందికి ఉద్యోగాలు కల్పించడం జరిగింది. జాబ్ మేళాల్లో ఎమ్మెల్యేలంతా భాగస్వాములు కావాలి. ప్రస్తుతం లిఫ్ట్ మెకానిక్ ల షార్టేజీ ఎక్కువగా ఉంది. నెలకు 30వేలు జీతం ఇస్తామన్నా ఆ టెక్నీషియన్లు దొరకడం లేదు. ఎలక్ట్రీషియన్లు, క్వాలిటీ ప్లంబర్లకు కూడా తీవ్రమైన కొరత ఉంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏపీ ఎస్ఎస్ డీసీ, సీడాప్, న్యాక్ ద్వారా 73వేలమందికి ఇప్పటికే శిక్షణ ఇచ్చాం. అందులో 40వేలమందికి ఉద్యోగాలు లభించాయి. కులవృత్తులను ప్రోత్సహించేందుకు గౌరవ ప్రధానమంత్రి పీఎం విశ్వకర్మ పథకాన్ని కూడా ప్రవేశపెట్టారు. బీసీ సంక్షేమ మంత్రి, ఎంఎస్ఎంఈ మంత్రులతో మాట్లాడి ఇప్పటికే 1.89 లక్షలమందికి అందులో శిక్షణ ఇచ్చాం. క్యాంపస్ లలో ఏఐ, మిషన్ లెర్నింగ్ పై యాడ్ ఆన్ కోర్సులు తీసుకువచ్చి, 3.11 లక్షలమందికి శిక్షణ ఇచ్చాం. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి స్కిల్ సెన్సస్ పై విస్తృతంగా చర్చించారు. మంగళగిరిలో స్కిల్ సెన్సస్ చేపట్టాలని ప్రయత్నించినపుడు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఆ అనుభవంతో స్కిల్ ఎసెస్ మెంట్ చేయాలని నిర్ణయించాం. అందులో భాగంగా త్వరలో నైపుణ్యం పోర్టల్ ప్రారంభించబోతున్నాం. ఇందులో ఆధార్ బేస్డ్ క్రెడెన్షియల్ వెరిఫికేషన్ తోపాటు, బిల్డ్ యువర్ ఓన్ రెస్యూమ్ కాలమ్ ద్వారా విద్యార్థులు తమ రెస్యూమ్ ను అప్ లోడ్ చేయడంతో అప్ గ్రేడ్ చేయవచ్చు. ఇందులో ఆన్ లైన్, ఆఫ్ లైన్ ద్వారా ఏఐ బేస్డ్ స్కిల్ కోర్సులను కూడా నేర్చుకోవడానికి అవకాశం కల్పిస్తాం. కాన్వర్సేషన్ ఏఐ టూల్ ద్వారా సెల్ఫ్ ఎసెస్ మెంట్ చేసుకోవడానికి ఇందులో అవకాశం ఉంటుంది. ఏసీ మెకానిక్ నుంచి ఏఐ ఇంజనీర్ వరకు ఎసెస్ మెంట్ కు అవకాశం కలుగుతుంది. ప్రపంచంలోనే తొలిసారిగా ఇటువంటి పోర్టల్ ను ప్రవేశపెట్టబోతున్నాం. మార్చి చివరి నాటికి ఇది పూర్తిస్థాయిలో సిద్ధమవుతుంది. ఏఐ బేస్డ్ ఎగ్రిగేషన్ ద్వారా ఉద్యోగ అవకాశాలను కూడా ఇందులో అందుబాటులో ఉంచుతాం. ఏఐ ట్యూటర్ ద్వారా ఇంటర్వ్యూలకు శిక్షణ కూడా ఇస్తాం. నర్సింగ్ పై పారా మెడికల్ కోర్సుల్లో కూడా ట్రైనింగ్ ఇవ్వాలని సభ్యులు కోరారు. యూరప్, జపాన్, జర్మనీలలో ఈ కోర్సులకు చాలా డిమాండ్ ఉంది. ఇందుకోసం ఓంక్యాప్ ద్వారా లాంగ్వేజ్ ట్రైనింగ్ చేస్తున్నాం. ఇప్పటికే 150మందిని వివిధ దేశాలకు పంపించాం. 5లక్షలమందిని విదేశాలకు పంపడం మా లక్ష్యం. గతంలో ఎపెక్స్ స్కిల్ యూనివర్సిటీ, పార్లమెంటు, నియోజకవర్గ కేంద్రాల్లో స్కిల్ కాలేజి ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు కానీ ఒక్కటి కూడా అమలుకాలేదు. గతంలో స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ సిబ్బందితో పార్టీ పనిచేయించి ఉంటే విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. జాబ్ మేళాల నిర్వహణలో క్వాలిటీ పెంచుతాం. అందరం కలిసికట్టుగా పనిచేస్తే 175 నియోజకవర్గాల్లో ప్రతి యువకుడికి ఉద్యోగం కల్పించవచ్చు. ప్రతి స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ను సీసీ టీవీ మానిటరింగ్ ద్వారా పర్యవేక్షిస్తున్నాం. ఫేషియల్ రిక్నగ్నిషన్ సిస్టమ్ కూడా అమలు చేస్తున్నాం. డైట్, బి.ఎడ్, ఇంజనీరింగ్ కాలేజీలలో కూడా ఎఫ్ఆర్ఎస్ పెట్టాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. న్యాక్ ను బలోపేతం చేసి, వరల్డ్ క్లాస్ క్వాలిటీ వర్కర్స్ ను తయారు చేస్తాం. రాబోయే 90రోజుల్లో యుద్ధ ప్రాతిపదికన న్యాక్ ను బలోపేతం చేసే చర్యలు చేపట్టబోతున్నాం. ఇంటర్న్ షిప్ ప్రోగ్రామ్ పై యార్లగడ్డ నేతృత్వంలో ఐదుగురితో ఒక కమిటీ వేస్తామని మంత్రి లోకేష్ పేర్కొన్నారు.

# చేనేతకు 'అసెంబ్లీ' ఆదరణ





**అమరావతి,కలంకౌంటర్ :** చేనేత వస్త్రాల అమ్మకాల పెంపుదలకు కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు విజయవం తమవుతున్నాయి. ఏపీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ఆవరణలో ఏర్పాటు చేసిన చేనేత స్టాళ్లకు విశేష స్పందన లభిస్తోంది. స్పీకర్ అయ్యన్న పాత్రుడు సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రభుత్వ విప్ లు చేనేత వస్త్రాల కొనుగోలుకు ముందుకొస్తున్నారు. రోజూ ఆ స్టాళ్లను సందర్శిస్తూ చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నారు. ఈ నెల 20 తేదీన చేనేత స్టాళ్లను అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రారంభించారు. రాష్ట్రంలో అన్ని జిల్లాలకు చెందిన ప్రఖ్యాతగాంచిన చేనేత ఉత్పత్తులను ఆ స్టాళ్లలో అమ్మకానికి పెట్టారు. ఆనాటి నుంచి రోజూ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, విప్ లు ఆ స్టాళ్లను సందర్శిస్తున్నారు. రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత ...నిత్యం స్టాళ్లను సందర్శిస్తూ.. తోటి మంత్రులు, ఎమ్మెల్యేలతో చేనేత ఉత్పత్తులు కొనుగోలు చేసేలా కృషి చేస్తున్నారు. బుధవారం కూడా మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు భూమా అఖిలప్రియ, ప్రశాంతిరెడ్డి సహా పలువురు ఎమ్మెల్యేలు చేనేత స్టాళ్లను సందర్శించి వస్త్రాలను కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సవిత... చేనేత రెడీ మెడ్ దుస్తులు సహా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన పొందూరు షర్ట్ లు, పంచెలు, కండువాలు, మాధవవరం, వెంకటగిరి, ధర్మవరం, రాజమండ్రి, ఉప్పాడ, బందరు, మానపల్లి పట్టు, సాధారణ చీరలను వారికి చూపించి కొనుగోలు చేయించారు. అసెంబ్లీ విధుల్లో పాల్గొంటున్న ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు సైతం స్టాళ్లలో చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేయడం విశేషం. అసెంబ్లీలో ఏర్పాటు చేసిన స్టాళ్లకు విశేష స్పందన రావడంపై ఆయా జిల్లాల నేతన్నలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. సీఎం చంద్రబాబుకు, స్పీకర్ అయ్యన్నపాత్రుడికి, మంత్రి సవితకు, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు, ప్రభుత్వ విప్ లకు ధన్యవాదాలు తెలియజేస్తున్నారు.

# పేదల సొంత ఇంటి కల నెరవేర్చండి

- విజిలెన్స్ విచారణలతో కాలయాపన చేయకుండా పేదలకు ఇళ్లు దక్కేలా తక్షణ చర్యలు చేపట్టాలి.
- భూసేకరణ పేరుతో కొంత, ల్యాండ్ డెవలప్‌మెంట్ పేరుతో మరికొంత మొత్తాన్ని గత పాలకులు దోచుకుంటే.. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకుండానే కాంట్రాక్టర్లు బిల్లులు డ్రా చేసుకున్నారు.
- గత ప్రభుత్వ తప్పిదాల వల్ల పేదల సొంత ఇంటి కల కలగానే మిగిలిపోయింది.
- శాసనసభలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి



**అమరావతి,కలంకౌంటర్ :** గత ప్రభుత్వ తప్పిదాల వల్ల పేదల సొంత ఇంటి కల కలగానే మిగిలి పోయిందన్నారు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి గారు. శాసనసభ సమావేశాలలో పేదల పక్కా ఇళ్ల సమస్యపై ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వ అవినీతిపై ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయాంలో హౌసింగ్ విషయంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాలు, అవకతవకల వల్ల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు గ్రామీణ ప్రాంతాలలోని క్షేత్రస్థాయి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. భూసేకరణ పేరుతో కొంత మొత్తం, ల్యాండ్ డెవలప్‌మెంట్ పేరుతో మరికొంత మొత్తాన్ని గత పాలకులు దారిమళ్లించారని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు ఆరోపించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయకుండా కాంట్రాక్టర్లు బిల్లులు డ్రా చేసుకున్నారని నియోజకవర్గ పరిధిలో వేలాదిగా పునాది దశలోనే ఆగిపోయిన అసంపూర్తి ఇళ్ల నిర్మాణాల గురించి ఆమె సభలో ప్రస్తావించారు. నియోజకవర్గ పరిటాల పర్యటనలకు వెళ్ళినప్పుడు ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల ప్రజలు తమకు ఇల్లు కావాలని కోరుతున్నారని ఆమె తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలు సంతోషంగా ఉన్నప్పటికీ ఈ గృహనిర్మాణ సమస్య మాత్రం వారిని వేధిస్తోందని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి గారు ఆవేదన వ్యక్తం చేశారు. అసెంబ్లీలో ఎన్నిసార్లు చర్చించుకున్నా పేదల ఇళ్ల సమస్య మాత్రం కొలిక్కి రావడం లేదని విజిలెన్స్ విచారణలతో కాలయాపన చేయకుండా పేదలకు ఇళ్లు దక్కేలా తక్షణ చర్యలు చేపట్టాలి ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పేదల పక్షాన నిలబడి యుద్ధ ప్రాతిపదికన పక్కా ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేలా ఒక స్పష్టమైన పరిష్కారం కనుగొనాలని ఆమె గృహ నిర్మాణ శాఖ మంత్రి కి సూచించారు. బడుగు బలహీన వర్గాల ఆకాంక్షలను నెరవేర్చడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేయాలని కోరారు.

## మచిలీపట్నం లో పట్టపగలు చోరీ కలకలం!

**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం సర్కార్ తోట ప్రాంతంలో పట్టపగలు చోరీ ఘటన సంచలనం సృష్టించింది. పెడన మండలం కౌతరం ప్రభుత్వ పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న నిమ్మగడ్డ మార్గనేట్ ఇంట్లో ఈ చోరీ జరిగింది. ఉదయం 7 గంటలకు విధులకు వెళ్లిన టీచర్, తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంటి తలుపులు పగులగొట్టి దుండగులు చోరీ చేసినట్లు గుర్తించారు. ఇంట్లో విలువైన బంగారు నగలు, నగదు అపహరించబడినట్లు సమాచారం. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు. అదేవిధంగా పోలీస్ జాగిలాలను రంగం లోకి దింపి దుండగుల జాడ కోసం గాలింపు చేపట్టారు. పట్టపగలు జరిగిన ఈ చోరీతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. నగరంలో వరుస చోరీల నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తు చేస్తున్నారు.

# టిడిపి తీర్థం పుచ్చుకున్న వైసిపి నాయకులు

**పార్టీలోకి ఆహ్వానించిన ఎంపీ కేశినేని శివనాథ్**





**విజయవాడ,కలంకౌంటర్ :** తిరువూరు టిడిపి టౌన్ అధ్యక్షుడు మల్లెల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తిరువూరు పట్టణానికి చెందిన వైసిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి రామడుగు రామకోట చారి (ఆర్.ఆర్.కె. చారి), గీతం స్కూల్ కరస్పాండెంట్ గీతమ్స్ చారి ఎంపీ కేశినేని శివనాథ్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్ లో బుధవారం ఈ చేరికల కార్యక్రమం జరిగింది. ఎంపీ కేశినేని శివనాథ్ వారికి పసుపు కండువాలు కప్పి సాదరంగా పార్టీలో ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తిరువూరు టిడిపి టౌన్ అధ్యక్షుడు మల్లెల శ్రీనివాసరావు, బిసి సెల్ నాయకులు కందిమళ్ల శేషగిరిరావు, టిడిపి నాయకులు మాదల హరిచరణ్ (కిట్టు), మోదుగ వెంకటేశ్వరరావు, యంద్రాతి కిరణ్, తూళ్లురి అనిల్, తాళ్లూరి వెంకటేశ్వరరావు, చిన్న జమలయ్య, షేక్ హుస్సేన్, షేక్ ఉమర్, కందిమళ్ల సాయి సునీల్, టిడిపి మహిళ నాయకులు మాధవి లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టులకు బ్లూప్రింట్

(మొదటి పేజీ తరువాయి)

అందుతుంది. 2019లో మనమే అధికారంలోకి వచ్చి ఉంటే 2021లోనే ప్రాజెక్టు పూర్తి చేసి నీరిచ్చేవాళ్లం. 2019-2024 మధ్య చీకటి రోజులు వచ్చాయి. గత ముఖ్యమంత్రి వెలిగొండ పూర్తి కాకుండానే జాతికి అంకితమంటూ దొంగ నాటకాలు ఆడాడు. చీమకుర్తి, మార్కాపురం సభల్లో 2023లో పూర్తి చేస్తానని హామీ ఇచ్చాడు. ఉత్తుత్తి ప్రాజెక్టుకు రిబ్బన్ కటింగ్ చేశాడు. ఇలా చేయడం మోసం కాదా. నేను చేయగలిగిందే చెబుతున్నాను. వెలిగొండ ప్రాజెక్టుకు పూర్తికి రూ.9081 కోట్ల నిధులు కావాలి. ఇప్పటి వరకూ ప్రాజెక్టు నిర్మాణానికి రూ.5451 కోట్లు ఖర్చు వ్యయం చేశాం. భూసేకరణకు రూ.484 కోట్లు, పునరావాసానికి రూ.184 కోట్లు ఖర్చు చేశాం. రెండు దశల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రణాళిక చేశాం. ఇంకా రూ.2,540 కోట్లు ఖర్చు చేస్తే కానీ వెలిగొండ పనులు పూర్తి కావు. గడచిన 20 నెలల్లో రూ.540 కోట్లు ఖర్చు చేసి పనులు వేగంగా చేపట్టాం. రూ.456 కోట్లతో విలువైన ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేశాను. గత పాలకులు ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుకు కేవలం రూ.500 కోట్లు ఖర్చు చేసి పనులు అయిపోయాయని రైతులకు పంగ నామాలు పెట్టారు. మంచి చేసిన వారికి అండగా నిలుస్తేనే ప్రజల జీవితాలు మెరుగు అవుతాయని ముఖ్యమంత్రి అన్నారు.

**రూ.1300 కోట్లతో ప్రతీ ఇంటికీ సురక్షిత తాగునీరు..** అన్ని వర్గాలకు న్యాయం చేయడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యం. ఎక్కడ పేదలు ఉంటే అక్కడ నేను ఉంటాను. ఎన్నికల్లో చెప్పినట్టే సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. పింఛన్ల కోసం ప్రతి ఏటా రూ.34 వేల కోట్లు వెచ్చిస్తున్నాం. ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అంత మందికి తల్లికి వందనం ఇస్తున్నాం. స్త్రీ శక్తి కింద ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నాం. మగవారితో సమానంగా మహిళలకు అవకాశాలు రావాలని డ్వాక్రా సంఘాలు స్థాపించాను. ఈ ఏడాది లక్షమంది ఆడబిడ్డలను పారిశ్రామిక వేత్తలుగా తయారుచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. దీపం పథకం కింద మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తున్నాం. అన్నదాత సుఖీభవ కింద రైతులకు మూడు విడతల్లో రూ. 20,000 ఇస్తున్నాం. 2027లో పుష్కరాలకు ముందే పోలవరం పూర్తిచేసి జాతికి అంకితం చేస్తాం. నల్లమల సాగర్ కు గోదావరి నీళ్లు ఇస్తాం. అది వచ్చేలోగా ఈ ఏడాది జూలై నాటికి నల్లమల సాగర్ పూర్తి చేసి వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితం చేస్తాం. ఈ ప్రాజెక్టు కోసం ఇంకా రూ. 2 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంది. గతేడాది హంద్రినీవాపై శ్రద్ధ పెట్టాం. ఈ ఏడాది వెలిగొండ పై శ్రద్ధ పెట్టి ప్రజల జీవితాల్లో జలకళ తీసుకొస్తాం. హార్టికల్చర్ కు ఎక్కువ ప్రాధాన్య ఇస్తున్నాం. రాయలసీమను హార్టికల్చర్ హబ్ గా మారుస్తున్నాం. సీమతో పాటు మార్కాపురం, ప్రకాశం జిల్లాలను ఉద్యాన పంటలతో అభివృద్ధి చేస్తాం. మార్కాపురాన్ని ఉద్యాన పంటలకు కేంద్రంగా తయారు చేసేందుకు ప్రజలు సహకరించాలి. రూ.1300 కోట్లు వ్యయంతో నల్లమల సాగర్ నుంచి ప్రతి ఇంటికి సురక్షిత నీరు అందించే బాధ్యత తీసుకుంటామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**రూ.50 కోట్లతో జిల్లా కలెక్టరేట్ నిర్మిస్తాం..** ప్రజలకు హామీ ఇచ్చినట్టుగానే మార్కాపురాన్ని జిల్లాగా చేసి ఇక్కడి ప్రజల ఆకాంక్షల్ని నెరవేర్చాం. మార్కాపురం జిల్లాలో భూ రికార్డుల సమస్యలున్నాయి. మేము అధికారంలోకి వస్తూనే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు చేశాం. గత పాలనలో ల్యాండ్ రికార్డులన్నీ అస్తవ్యస్తం చేశారు. అడిగిన భూములు ఇవ్వకపోతే 22ఏలో పెట్టారు. సర్వే రాళ్లపై వారి ఫోటోలు వేసుకున్నారు. మేము రాజముద్రతో పట్టదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నాం. క్యూఆర్ కోడ్ తో భూమి రికార్డులు భద్రంగా తయారు చేయిస్తున్నాం. ఎవరైనా తప్పు రికార్డులు చేస్తే తాట తీస్తామని హెచ్చరిస్తున్నాను. మార్కాపురం జిల్లా నూతన కలెక్టరేట్ భవనానికి రూ. 50 కోట్లు మంజూరు చేస్తున్నాం. 20 నెలల పాలనలో రూ. 20 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయి. యువతకు ఉద్యోగాలు ఇప్పించే బాధ్యత తీసుకుంటాం. అవినీతికి తావు లేకుండా మెగా డీఎస్సీ నిర్వహించాం. కానిస్టేబుళ్ల నియామకాలు పూర్తి చేశాం. వరద నీరు వృథాగా పోకుండా భూగర్భ జలాలు పెంచుతాం. గోదావరి నుంచి 6000 టీఎంసీలు, కృష్ణా నుంచి 1500 టీఎంసీల నీరు వృథాగా సముద్రంలోకి వెళ్లింది. వెలిగొండ ప్రాజెక్టుకు కావాల్సింది కేవలం 53 టీఎంసీల నీరే. ఈ జిల్లాలో ఫ్లోరైడ్ సమస్య ఉంది. ఫ్లోరైడ్ సమస్య ఉన్న ప్రాంతాల్లో సురక్షిత నీరు సరఫరా చేస్తాం. పరిశుభ్రమైన రాష్ట్రం కోసం ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛాంధ్ర నిర్వహిస్తున్నాం. పేదలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పీ4 కార్యక్రమం చేపట్టాం. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పౌరులకు ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

**2019-24 మధ్య రాష్ట్రానికి చీకటి రోజులు..** గత పాలకులు చేయని అపచారం లేదు. కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడారు. కెమికల్స్ కలిపిన నెయ్యితో లడ్డూలు చేసి విక్రయించారు. ఆ నెపాన్ని హెరిటేజ్ పై మోపారు. ఆనాడు బాబాయ్ ని చంపేసి మరుసటి రోజు సాక్షి పత్రికలో నారా సుర రక్త చరిత్ర అని నా చేతిలో కత్తి పెట్టాడు. నోరు తెరిస్తే బూతులు మాట్లాడతారు. నా తల్లి, భార్య, మా పార్టీ నేతలను ఇష్టానుసారంగా దుర్భాషలాడారు. ప్రజా సమస్యలపై చర్చించేందుకు అసెంబ్లీకి రారు కానీ అసెంబ్లీలో ప్రతిపక్ష హోదా కావాలంటారు. వాళ్లు బెదిరిస్తే ఇవ్వాలా. ప్రజాస్వామ్యంలో ప్రజలు ఓట్లు వేస్తేనే ఏదైనా సాధ్యం అని కూడా వారికి తెలీదా? గత ఐదేళ్లలో రాష్ట్రంలో విధ్వంస జరిగింది. ప్రజలు ఇంట్లో నుంచి బయటకు రావాలంటే భయపడ్డారు. గంజాయి, భూ కబ్జాలు, దౌర్జన్యాలతో హడలిపోయారు. నేను ఎవరు తిట్టినా లెక్కపెట్టుకోను. నేను జీవిస్తోంది ప్రజలు, రాష్ట్రం కోసమే. నాకు కుల, మత విభేదాలు లేవు. తెలుగు జాతి అభ్యున్నతి నాకు ముఖ్యం. బడుగు, బలహీన వర్గాలను పైకి తీసుకొచ్చి అవకాశాలు కల్పిస్తాం. నేను ఆనాడు టెక్నాలజీని ప్రమోట్ చేశాను. మన దూరదృష్టి కారణంగా దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం తెలంగాణ నుంచి వస్తోంది. గుజరాత్ రాష్ట్రంలో 25 ఏళ్లుగా ఒకే పార్టీ అధికారంలో ఉంది. మోదీ 3వ సారి ప్రధాని అయ్యారు. మరోసారి అవుతారు. ప్రజలు ఏది మంచి, ఏది చెడు అనేది ఆలోచన చేసి...కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సమర్థులను గెలిపించాలని ముఖ్యమంత్రి కోరారు.

















**స్థానిక రైతులతో కలిసి ఫీడర్ కాలువ పనులు పరిశీలన..** వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువ పనుల శంకుస్థాపన అనంతరం రైతులు వెంకటేశ్వరరెడ్డి, సురవరం గండి వీరారెడ్డిలతో సంభాషిస్తూ ఫీడర్ కెనాల్ పనుల్ని ముఖ్యమంత్రి చంద్రబాబు పరిశీలించారు. వెలిగొండ పూర్తి అయితే ఈ ప్రాంత భూగర్భజలాలు కూడా పెరుగుతాయని, బోర్లకు, చెరువులకు నీరు వస్తాయని ముఖ్యమంత్రికి రైతులు వివరించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పనులు, ఫీడర్ కాలువ పనులు వేగంగా చేపడుతున్నందుకు ముఖ్యమంత్రికి స్థానిక రైతులు ధన్యవాదాలు తెలిపారు. అరటి, బొప్పాయి లాంటి పంటల సాగు చేసేందుకు అనుకూల ప్రాంతమని, మీరే శంకుస్థాపన చేశారు, మీరే ప్రాజెక్టు ప్రారంభోత్సవం చేస్తున్నారని సీఎంతో రైతులు అన్నారు. ప్రాజెక్టులో రూ.2500 కోట్ల విలువైన పనులు మిగిలి ఉన్నా వాటిని పూర్తి చేయకుండా జాతికి అంకింతం చేసినట్టు గత పాలకులు నాటకాలాడారని ముఖ్యమంత్రి అన్నారు.

**వెలిగొండ పనుల పురోగతిపై అధికారులతో సమీక్ష..** ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, పనులు జరుగుతున్న తీరుపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షించారు. 11,580 క్యూసెక్కుల నీరు ప్రవహించేలా ఫీడర్ కాలువ పనులు చేపట్టామని జల వనరుల శాఖ అధికారులు వివరించారు. నల్లమల సాగర్ ప్రాంతంలో మూడు గ్యాప్స్ ఫిల్ చేసి రిజర్వాయర్ ఏర్పడిందని , తద్వారా 53.83 టీఎంసీల నీరు నిల్వ చేసుకునే అవకాశం ఉందని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. రోజుకు 200 మీటర్ల మేర కాలువ లైనింగ్ పనులు చేస్తున్నామని , 1.80 లక్షల క్యూబిక్ మీటర్ల మేర సైడ్ వాల్ పనులు మే చివరి నాటికి పూర్తి చేస్తామని ముఖ్యమంత్రికి తెలిపారు. ఫ్లడ్ సీజన్ ప్రారంభం అయ్యే సమయానికి ఫీడర్ కాలువ సిద్ధం అయిపోతుందని వెల్లడించారు. 45 రోజుల్లో 45 టీఎంసీల మేర నీరు డ్రా చేసుకుని నల్లమల సాగర్ నింపేందుకు ప్రణాళిక చేసినట్టు అధికారులు ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. వెలిగొండ ప్రాజెక్టు సొరంగాలు, కాలువ పనులు తదితర అంశాలను నమూనా ద్వారా వివరించారు. కంబం చెరువును కూడా నింపేలా కాలువను అనుసంధానించినట్టు తెలిపారు. స్థానికంగా వివిధ చెరువులు, నీటి వనరుల్ని నింపేందుకు అవసరమైన స్ట్రక్చర్లను పూర్తి చేయాలని సీఎం అధికారులకు ఆదేశించారు. రూ. 400 కోట్లతో ఈ పనులు చేపట్టేందుకు వీలుగా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. వెలిగొండ టన్నెళ్ల పనులు పూర్తి అయ్యాక, పోరుమామిళ్ల, రాచర్లకు కూడా నీరు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా పనులు పూర్తి చేయాలని, వెలిగొండ ప్రాజెక్టు పనుల పురోగతి ఎప్పటికప్పుడు తనకు తెలియచేయాలని ఉన్నతాధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు.

**మార్కాపురంలో ముఖ్యమంత్రికి అపూర్వ స్వాగతం..** నూతన జిల్లాగా ఏర్పడిన తర్వాత తొలిసారి మార్కాపురంలో పర్యటించిన ముఖ్యమంత్రికి ఘన స్వాగతం లభించింది. మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి, నిమ్మల రామానాయుడు, ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, జిల్లా వ్యాప్తంగా ప్రజాప్రతినిధులు స్వాగతం పలికారు. జిల్లా ఏర్పాటు కలను నిజం చేసినందుకు ముఖ్యమంత్రికి నాయకులు ధన్యవాదాలు తెలిపారు. మార్కాపురం జిల్లా కళ, వెలిగొండ జలకళ సభకు హాజరైన ముఖ్యమంత్రికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. వేదిక నుంచి ప్రజల మధ్యకు వేసిన ర్యాంపు పై నడుస్తూ, ప్రజలకు అభివాదం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. ప్రజలు హర్షాతిరేకాల మధ్య ఆయన ప్రసంగం యావత్తూ ఉత్సాహంగా సాగింది. సభకు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా ప్రజలు, అభిమానులు తరలి వచ్చారు.

## జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వంనమోదు విజయవంతం చేయాలి - బండి రామకృష్ణ




**మచిలీపట్నం,కలంకౌంటర్ :** మచిలీపట్నం జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ ఇంచార్జ్ డిసిఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణమాట్లాడుతూ జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలని జనసేన పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈనెల 26వ తేదీ నుండి సభ్యత నమోదు కార్యక్రమం ప్రారంభమవుతుందని మచిలీపట్నం నియోజకవర్గంలోని 34 పంచాయతీలు 50 డివిజన్లో పండుగ వాతావరణం లో జనసేన పార్టీ శ్రేణులు నిర్వహించాలని పేర్కొన్నారు. నియోజవర్గానికి 75 నుండి 100 మంది సాధకులను నియమించినట్లు వివరించారు. సభ్యత్వం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించాలన్నారు .సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని మచిలీపట్నం నియోజకవర్గంలో కార్యకర్తలు జన సైనికులు వీర మహిళలు జనసేన పార్టీ ప్రజా ప్రతినిధులు ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. జనసేన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జనసేన పార్టీ బలోపేతం కోసం పనిచేసేవారిని ఉద్యమ, సాధక్,ప్రదాతలుగా వర్గీకరించినట్లు తెలిపారు పార్టీ తొలి సభ్యత్వం లి పవన్ కళ్యాణ్ స్వీకరించి రెండు కోట్ల రూపాయలనులి కార్యకర్తల కోసం విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు ఉద్యమి సభ్యత్వ నమోదు 400రూ గా నిర్ణయించినట్లు బండి రామకృష్ణ వివరించారు ఈ కార్యక్రమంలో మచిలీపట్నం జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు, మండల పార్టీ అధ్యక్షులు గళ్ళాతిమోతి, వైస్ ప్రెసిడెంట్ మహమ్మద్ సమీర్, యూత్ అధ్యక్షులు కూనపరెడ్డి ప్రసాద్, నీటి సంఘ అధ్యక్షులుశాయన శివయ్య డివిజన్ ఇన్చార్జులు పినిశెట్టి వేణు, చలమల శెట్టి రమేష్, తోటరాజేష్, మంత్రి పృధ్వి, కొల్లపల్లిగణేష్ జనసేన పార్టీ ప్రజాప్రతినిధులు వివిధ హోదాలో ఉన్న నాయకులు పాల్గొన్నారు.

## వెలుగొండ పూర్తికాకుండానే జాతికి అంకితం చేసి జగన్ జిల్లా ప్రజలను మోసం చేశారు

- వైసీపీవన్నీ ఫేక్ మాటలు, ఫేక్ రాజకీయాలే
- ఎన్నికల్లో చెప్పిన మాటకు కట్టుబడి సీఎం చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లా ఏర్పాటు చేశారు
- త్వరలోనే వెలుగొండ పూర్తిచేసి ఉమ్మడి ప్రకాశం జిల్లాను సస్యశ్యామలం చేస్తాం
- గత 5 ఏళ్లు జగన్ చేసిన మోసాలకే ప్రజలు వైసీపీని 11 సీట్లకు పరిమితం చేశారు
- మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

**మార్కాపురం,కలంకౌంటర్ :** ఎన్నికల్లో చెప్పిన మాటకు కట్టుబడి సీఎం చంద్రబాబు నాయుడు మార్కాపురం జిల్లా ఏర్పాటు చేశారు,త్వరలోనే వెలుగొండను పూర్తిచేసి ఉమ్మడి ప్రకాశం జిల్లాను సస్యశ్యామలం చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం మార్కాపురం జిల్లా వెలుగొండ ప్రాజెక్టు ఫీడర్ కెనాల్ కి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన కార్యక్రమం అనంతరం మార్కాపురంలో నిర్వహించిన బహిరంగ సభలో మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మాట్లాడుతూ...వెలుగొండ ప్రాజెక్టు పూర్తికాకుండానే ఎన్నికల ముందు జాతికి అంకితం చేసి జగన్ జిల్లా ప్రజలను మోశారు. నాడు వెలిగొండ పూర్తయిందంటూ వైసీపీ నీలి మీడియాలో నానా హంగామా చేశారు, నేడు వైసీపీ నేతలు వెలుగొండకు నిధులు కేటాయించాలని మాట్లాడుతున్నారు. ఇంతకంటే మోసం ఇంకొకటి లేదు, ప్రజలు ఏమనుకుంటారోనన్న కనీస స్పృహ కూడా లేకుండా వైసీపీ నేతలు అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్నారు. వైసీపీవన్నీ ఫేక్ మాటలు, ఫేక్ రాజకీయాలే. ఎన్నికల్లో చెప్పిన మాటకు కట్టుబడి సీఎం చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే మార్కాపురం జిల్లా ఏర్పాటు చేశారు. త్వరలోనే వెలుగొండ ప్రాజెక్టు పూర్తిచేసి ఉమ్మడి ప్రకాశం జిల్లాను సస్యశ్యామలం చేస్తాం, పారిశ్రామిక హబ్ గా తీర్చిదిద్దుతాం. గత 5 ఏళ్లు జగన్ చేసిన మోసాలకే 11 సీట్లకు పరిమితమయ్యారు. జగన్ మాదిరి మేం ప్రజలను మోసం చేయం. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ చెప్పిన హామీలన్నీ అమలు చేస్తున్నాం. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలన సాగిస్తున్నారని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు.



# బీచ్ సాండ్ ఖనిజాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

● టైటానియం, రేర్ ఎర్త్ రంగాల్లో ఆంధ్రప్రదేశ్‌కు కొత్త దిశ : కొల్లు రవీంద్ర






**విజయవాడ,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్‌ను టైటానియం, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలపాలని రాష్ట్ర ప్రభుత్వం దృఢ సంకల్పంతో ముందుకు సాగుతోందని గనులు, భూగర్భ వనరుల, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. బీచ్ సాండ్ ఖనిజాలు రాష్ట్రానికి సహజ వరమని, వాటిని సమర్థవంతంగా వినియోగిస్తే భారీ పారిశ్రామిక విప్లవానికి నాంది పలుకుతాయని పేర్కొన్నారు. ఖనిజాలను తవ్వి ఎగుమతి చేసే దశను దాటుకుని, రాష్ట్రంలోనే శుద్ధి, ప్రాసెసింగ్, తుది ఉత్పత్తుల తయారీ వరకు పూర్తి విలువ పెంపు గొలుసును నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. విజయవాడ నోవోటెల్ లో "బీచ్ సాండ్ ఖనిజాల నుంచి టైటానియం, రేర్ ఎర్త్ ఎలిమెంట్స్ , శాశ్వత అయస్కాంతాలు -- ఆంధ్రప్రదేశ్‌లో దేశీయ విలువ పెంపు గొలుసుల నిర్మాణం: అవకాశాలు" అనే అంశంపై నిర్వహించిన వర్క్‌షాప్‌లో మంత్రి కొల్లు మాట్లాడుతూ, టైటానియం, రేర్ ఎర్త్ పదార్థాలు రక్షణ, అంతరిక్ష, ఎలక్ట్రిక్ వాహనాలు, పునరుత్పాదక ఇంధన రంగాలకు కీలకమని వివరించారు. భవిష్యత్ సాంకేతిక రంగాలన్నీ ఈ వ్యూహాత్మక ఖనిజాలపై ఆధారపడి ఉంటాయని చెప్పారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులకు స్పష్టమైన విధానం, వేగవంతమైన అనుమతులు, భూకేటాయింపులు, మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. యువతకు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు సృష్టించడమే ఈ కార్యక్రమం లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రాన్ని టైటానియం, రేర్ ఎర్త్ పరిశ్రమల హబ్‌గా తీర్చిదిద్దడంలో ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న మాజీ డీఆర్‌డీఓ చైర్మన్ , ప్రభుత్వ సలహాదారు డా. జి. సతీష్ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా టైటానియం, రేర్ ఎర్త్ మాగ్నెట్లకు భారీ డిమాండ్ పెరుగుతోందన్నారు. రక్షణ, అంతరిక్ష, క్షిపణి సాంకేతికత, అధునాతన ఇంజినీరింగ్ రంగాల్లో ఈ పదార్థాల ప్రాముఖ్యత రోజురోజుకూ పెరుగుతోందని వివరించారు. స్వదేశీ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడం ద్వారా దిగుమతులపై ఆధారపడకుండ దేశం ముందుకు సాగగలదన్నారు. రాష్ట్రంలో సమృద్ధిగా లభించే బీచ్ సాండ్ ఖనిజాలను సాంకేతిక పరిజ్ఞానంతో విలువ పెంచితే అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీ పడే స్థాయికి చేరుకోవచ్చని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు కలిసి పనిచేస్తే ఆంధ్రప్రదేశ్ దేశానికి మార్గదర్శకంగా నిలుస్తుందని సతీష్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి (గనులు) ముకేష్ కుమార్ మీనా మాట్లాడుతూ, దీర్ఘకాలిక ఖనిజ సరఫరా భద్రతతో పాటు పరిశ్రమలకు అనుకూల విధాన వాతావరణాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. సింగిల్ విండో వ్యవస్థ ద్వారా వేగవంతమైన అనుమతులు, పారదర్శక విధానాలు అమలు చేస్తున్నామని తెలిపారు. బీచ్ సాండ్ ఖనిజాల వినియోగంలో పర్యావరణ పరిరక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. పెట్టుబడిదారులకు దీర్ఘకాలిక విధాన స్థిరత్వం, స్పష్టమైన మార్గదర్శకాలు అందుబాటులో ఉంటాయని ముఖేష్ కుమార్ మీనా భరోసా ఇచ్చారు. ఇండస్ట్రీస్ అండ్ కామర్స్ కార్యదర్శి యువరాజ్ మాట్లాడుతూ, పెట్టుబడిదారులకు ఎంతో అవసరమైన మౌలిక సదు-పాయాలు, పారిశ్రామిక పార్కులు, పోర్ట్ కనెక్టివిటీ వంటి అంశాలు ఆంధ్ర ప్రదేశ్ కు ఉన్న బలాలని చెప్పారు. వేగవంతమైన నిర్ణయాలతో పరిశ్రమలు త్వరగా స్థాపన దశకు చేరుకునేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన పరిశ్రమల వాతావరణాన్ని రాష్ట్రంలో ఏర్పరచేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. యువ పారిశ్రామికవేత్తలను ఈ రంగంలోకి ఆకర్షించేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాలు పరిశీలిస్తున్నామని వెల్లడించారు. ఏపీఎండీసీ వైస్ చైర్మన్ , ఎండీ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో గుర్తించిన బీచ్ సాండ్ ఖనిజ నిల్వలు పరిశ్రమలకు దీర్ఘకాలిక ముడి సరుకు భద్రతను అందిస్తాయని తెలిపారు. శాస్త్రీయ తవ్వకాలు, సమర్థవంతమైన ఖనిజ వేరు చేసే యూనిట్లు, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ అభివృద్ధి చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ముడి ఖనిజాల నుంచి విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ వరకు ఏపీఎండీసీ కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. పరిశ్రమలతో భాగస్వామ్యాల ద్వారా ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ మైన్స్ అండ్ జియాలజీ చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఖనిజ అన్వేషణ విస్తరణతో పాటు సాంకేతిక ఆధారిత పర్యవేక్షణ వ్యవస్థలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. బాధ్యతాయుత తవ్వకాలతో పాటు పారదర్శకతను పెంపొందిస్తున్నామని పేర్కొన్నారు. వర్క్‌షాప్‌లో నిపుణుల ప్యానల్ చర్చలు, సాంకేతిక ప్రదర్శనలు నిర్వహించారు. రాష్ట్రంలో భారీ పెట్టుబడులు ఆకర్షించి ఉపాధి అవకాశాలు సృష్టించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సమగ్ర కార్యాచరణను అమలు చేయనుంది.

# ఘన స్వాగతం..



**రాజమండ్రి,కలంకౌంటర్ :** మాజీ మంత్రి టీజీ వెంకటేష్ కి రాజమండ్రి ఎయిర్ పోర్టులో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఘన స్వాగతం పలికారు.

# ఏపీ పర్యాటక రంగానికి మహర్దశ

● శాసనమండలిలో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి ● పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా, నూతన పర్యాటక పాలసీ 2024-29తో 18 నెలల్లో రూ. 20,088 కోట్ల పెట్టుబడులు వచ్చాయని స్పష్టం ● కేంద్ర పథకాల ద్వారా రూ.429.06 కోట్లు మంజూరు..తద్వారా రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి చేస్తున్నామని వెల్లడి ● రాష్ట్రవ్యాప్తంగా పర్యాటక సర్క్యూట్ లు, హోమ్ స్టేలు ఏర్పాటు చేశామన్న మంత్రి దుర్గేష్ ● శాసనమండలిలో ఎమ్మెల్సీ సోమువీర్రాజు అడిగిన ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలిచ్చిన మంత్రి దుర్గేష్ ● విపక్ష సభ్యుల తీరుపై మంత్రి దుర్గేష్ ఆగ్రహం.. పర్యాటక శాఖ వివరాలు పారదర్శకంగా పబ్లిక్ డొమైన్ లో ఉంచామని వివరణ..సరైన డీపీఆర్, బ్రాండింగ్ కంపెనీలతో వస్తే పార్టీలకతీతంగా సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ



**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తూ భారీస్థాయిలో ఉపాధి కల్పించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ స్పష్టం చేశారు. బుధవారం శాసన మండలిలో ఎమ్మెల్సీ సోము వీర్రాజు అడిగిన ప్రశ్నలకు మంత్రి కందుల దుర్గేష్ సుదీర్ఘమైన, స్పష్టమైన సమాధానం ఇచ్చారు.

**ఉపాధి మరియు పెట్టుబడుల వెల్లువ:** ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు (ఎస్ఐపీబీ) ఆమోదించిన వివిధ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో 39,264 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుందని వెల్లడించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యాటక రంగానికి 'పారిశ్రామిక హోదా' కల్పించడం వల్ల గత 18 నెలల్లోనే రూ. 20,088 కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, ఇది ఒక విప్లవాత్మక మార్పు అని ఆయన అభివర్ణించారు. ఇందులో రూ. 9,445 కోట్లతో సుమారు 7,348 గదుల నిర్మాణం జరుగుతోందని తెలిపారు. నూతన పర్యాటక పాలసీ 2024-29తో పర్యాటక రంగంలో వినూత్న మార్పులు, విప్లవాత్మక సంస్కరణలు తెచ్చామన్నారు. అంతర్జాతీయ వేదికలపై ఏపీ బ్రాండ్ ను పెంపొందించేకు కృషి చేశామన్నారు. తద్వారా పర్యాటక రంగంలో పెట్టుబడులు వెల్లువలా వచ్చాయని వివరించారు. ముఖ్యంగా సీఐఐ సమ్మిట్ లో పెద్దఎత్తున ఎంవోయూలు కుదర్చుకున్నామన్నారు.

**కేంద్ర ప్రభుత్వ సహకారం - నిధుల వివరాలు:** కేంద్ర ప్రభుత్వంలోని పిలిగ్రిమ్ రెజువనేషన్ అండ్ స్పిరుచ్యువల్ ఆగ్మెంటేషన్ డ్రైవ్( ప్రసాద్), స్వదేశీ దర్శన్ 2.0, ఛాలెంజ్ బేస్డ్ డెస్టినేషన్ డెవలప్ మెంట్ (సీబీడీడీ), స్పెషల్ అసిస్టెన్స్ టూ స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్ మెంట్స్ (శాస్కి) తదితర పథకాల కింద రాష్ట్రానికి రూ.429.06 కోట్ల నిధులు మంజూరయ్యాయని మంత్రి దుర్గేష్ వివరించారు. శాస్కి ద్వారా అఖండ గోదావరికి రూ.94.44 కోట్లు, గ్రాండ్ క్యానియన్ ఆఫ్ ఇండియా అయిన గండికోట అభివృద్ధికి రూ. 77.91 కోట్లు, స్వదేశీ దర్శన్ 2.0 ద్వారా సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ.97.52 కోట్లు, అరకులోయ బొర్రా గుహల ఎక్స్ పీరియన్స్ సెంటర్ అభివృద్ధికి రూ.29.88 కోట్లు, సీబీడీడీ ద్వారా అహోబిలం అభివృద్ధికి రూ.25 కోట్లు, ప్రపంచ స్థాయి బౌద్ధ గమ్యస్థానంగా నాగార్జున సాగర్ బౌద్ధ వారసత్వ కేంద్రాల అభివృద్ధికి రూ.25 కోట్లు, ప్రసాద్ ద్వారా అన్నవరం, సింహాచలం వరహాలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానాల్లో నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 54.04 కోట్లు మంజూరు అయ్యాయని, ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో శరవేగంగా పనులు జరుగుతున్నాయని వివరించారు.


**కొత్త ప్రతిపాదనలు - పర్యాటక సర్క్యూట్లు:** ఇప్పటికే కేంద్రానికి మరిన్ని ప్రతిపాదనలు పంపినట్లు మంత్రి దుర్గేష్ తెలిపారు. ప్రసాద్ పథకం క్రింద గుంటూరు జిల్లాలో మంగళగిరి శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ అభివృద్ధి, శ్రీకాకుళం జిల్లాలో శ్రీకాకుళం, అరసవెల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానం అభివృద్ధి, శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా, శ్రీ గృహమల్లేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామంలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానం అభివృద్ధి, తూర్పు గోదావరి జిల్లా కోరుకొండలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ అభివృద్ధి చేయాలని ప్రతిపాదించామన్నారు. స్వదేశ్ దర్శన్ 2.0 పథకం కింద కృష్ణా జిల్లా మచిలీపట్నం వద్ద మచిలీపట్నం బీచ్ ను వైబ్రాంట్ బీచ్ గా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించామని వివరించారు. ఇవి కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. ఈ విషయమై కేంద్ర పర్యాటక మంత్రి గజేంద్ర సింగ్ ను కలిసి డీపీఆర్ లు అందించామన్నారు. అదే విధంగా రాష్ట్రంలో పర్యాటక సర్క్యూట్‌లను అభివృద్ధి చేస్తున్నామని చెబుతూ విశాఖ-అరకు, విశాఖ-సింహాచలం-అరసవిల్లి, రాజమహేంద్రవరం సర్క్యూట్, డా.బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాకు సంబంధించి ప్రత్యేక సర్క్యూట్, అమరావతి, తిరుపతి లలో వివిధ రకాల సర్క్యూట్ లు ఏర్పాటు చేసి ఆయా ప్రాంతాల ప్రత్యేకతలను మరింత పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. కోనసీమలో హోమ్ స్టే పాలసీ తీసుకొచ్చి హోమ్ స్టేలను పెంపొదిస్తున్నామన్నారు.

**పారదర్శకత - పెట్టుబడిదారులకు ఆహ్వానం:** పర్యాటక ప్రాజెక్టుల కోసం అందుబాటులో ఉన్న భూముల వివరాలను (సర్వే నంబర్లతో సహా) పర్యాటక శాఖ వెబ్‌సైట్‌లో బహిరంగంగా ఉంచామని మంత్రి దుర్గేష్ తెలిపారు. నిబంధనల ప్రకారం డీపీఆర్ లతో, బ్రాండింగ్ కంపెనీ తో వచ్చే ఇన్వెస్టర్లకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు.ఇవేవీ తెలుసుకోకుండా కొందరు సభ్యులు పర్యాటక శాఖపై నిందలు వేయడం తగదన్నారు. దరఖాస్తు చేసుకునే ఉద్దేశముంటే పార్టీలకతీతంగా సహకరించేందుకు తాము సిద్ధమన్నారు. ఈ సందర్భంగా అధికారుల స్పందనపై కొందరు శాసన మండలి సభ్యులు లేవనెత్తిన అంశాలపై స్పందిస్తూ విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి దుర్గేష్ తో పాటు మంత్రి అచ్చెన్నాయుడు కూడా స్పష్టం చేశారు. శాసనమండలి సభ్యులు సత్యదూరమైన వ్యాఖ్యలు చేయడం సరికాదని పేర్కొన్నారు. అటవీ, పర్యాటక, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ శాఖల మధ్య సమన్వయం కోసం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నేతృత్వంలో సీఎం చంద్రబాబునాయుడు ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ నిరంతరం సమీక్షిస్తోందని, తద్వారా పర్యాటక రంగాన్ని సరికొత్త ఎత్తులకు తీసుకెళ్తామని మంత్రి కందుల దుర్గేష్ ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఎమ్మెల్సీ సోమువీర్రాజు మాట్లాడుతూ పర్యాటక రంగంపై ప్రశ్న వేసింది తానని మంత్రి దుర్గేష్ స్పష్టమైన సమాధానమిచ్చారని ఈ సమయంలో ప్రతి సభ్యుడు కలగజేసుకోవడం సరికాదన్నారు.

# రైతు నిల్వ సామర్థ్యాల్లో చారిత్రాత్మక ముందడుగు..

## AIFతో రాష్ట్రంలో 1000కు పైగా ఆధునిక గోడౌన్లు

● రూ.504 కోట్ల భారీ పెట్టుబడి... గ్రామీణ వ్యవసాయ రంగానికి నూతన శకం ● PACSలను ఆధునిక మల్టీ పర్పస్ సౌకర్య కేంద్రాలుగా మారుస్తున్న ప్రభుత్వం ● తక్కువ వడ్డీ రుణాలు... పూర్తి ప్రభుత్వ హామీతో రైతు సంఘాలకు భరోసా ● డ్రైయింగ్ యార్డులు, ఆధునిక డ్రయర్లపై ప్రభుత్వ దృష్టి ● ఆకాల వర్షాలకు అడ్డుకట్ట... RSKల ద్వారా టార్పాలిన్ల పంపిణీ ● ఎలక్ట్రానిక్ డ్రయర్లపై పైలట్ ప్రాజెక్టులు...సాంకేతిక వ్యవసాయానికి శ్రీకారం ● శాసనమండలిలో సభ్యుల ప్రశ్నలకు సమాధానం తెలిపిన మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



**అమరావతి,కలంకౌంటర్ :** శాసన మండలిలో వ్యవసాయ మౌలిక సదుపాయాల నిధి (AIF) కింద ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు (PACS)ను బహుళార్ధ సాధక సౌకర్య కేంద్రాలు (MPFC)లుగా అభివృద్ధి చేసే కార్యక్రమంపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి అచ్చెన్నాయుడు సమగ్రంగా సమాధానం ఇచ్చారు. జూన్ 2020లో కేంద్ర ప్రభుత్వ Agriculture Infrastructure Fund (AIF) పథకం ద్వారా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని, రైతు భరోసా కేంద్రం (RSK) స్థాయిలో నిల్వ మరియు ఆరబెట్టే మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం ప్రధాన లక్ష్యమని ఆయన తెలిపారు. విశాఖపట్నం జిల్లా మినహా రాష్ట్రవ్యాప్తంగా గోడౌన్లు మరియు డ్రైయింగ్ యార్డుల నిర్మాణం జరుగుతోందని, మెం-త్తం రూ.504.42 కోట్ల వ్యయంతో ఈ పథకం అమలవుతోందని పేర్కొన్నారు. నాబార్డ్ ద్వారా రీఫైనాన్స్ సదుపాయం కల్పించబడుతుందని, PACSలకు 4% వడ్డీపై 3% వడ్డీ రాయితీ లభిస్తుందని, 90% రుణం మరియు 10% మార్జిన్ మనీ విధానంలో ప్రాజెక్టులు అమలవుతున్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మార్జిన్ మనీ కింద రూ.50.4 కోట్లు మంజూరు చేసి అందులో రూ.20 కోట్లు ఇప్పటికే విడుదల చేసిందని, 33 సంవత్సరాల పాటు ఏడాదికి రూ.1 నామమాత్రపు అద్దెకు ప్రభుత్వ భూమి లీజుకు ఇస్తున్నట్లు, రిజిస్ట్రేషన్ ఫీజు మరియు స్టాంపు డ్యూటీ మినహాయింపు కల్పించినట్లు చెప్పారు. ఈ పథకం కింద రుణాలకు ప్రభుత్వ హామీ ఉంటుందని స్పష్టం చేశారు. ఇప్పటివరకు 1005 పూఖీజ గోడౌన్ల పనులు ప్రారంభమై, 717 గోడౌన్లు మరియు అనుబంధ డ్రైయింగ్ యార్డులు పూర్తయ్యాయని, 572 PACSలో 1111 సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి తేమ మీటర్లు, తూనిక బ్యాలెన్స్‌లు, డెస్క్‌టాప్‌లు సరఫరా చేసినట్లు తెలిపారు. 232 ాూజూలలోని 462 అసేయింగ్ కేంద్రాలకు అవసరమైన ల్యాబ్ పరికరాలు అందించామని చెప్పారు. మొత్తం రూ.381.72 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయని, అందులో గోడౌన్ల నిర్మాణానికి రూ.373.97 కోట్లు, పరికరాల సరఫరాకు రూ.7.75 కోట్లు ఖర్చయ్యాయని వెల్లడించారు. ఈ చర్యల ద్వారా రైతులకు శాస్త్రీయ నిల్వ సదుపాయాలు కల్పించి, పంటలకు మెరుగైన ధరలు సాధించే అవకాశాలు పెరుగుతున్నాయని, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఈ పథకం కీలకంగా నిలుస్తుందని మంత్రి అచ్చెన్నాయుడు మండలికి తెలియజేశారు.

**రైతు ఆదాయం పెంపే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం..** ఆకాల వర్షాల కారణంగా పంట చేతికి వచ్చే సమయంలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం గుర్తించిందని, 2014--19 తెలుగుదేశం ప్రభుత్వ కాలంలో టార్పాలిన్లు పంపిణీ చేశామని, ఆ తరువాత పంపిణీ నిలిచిపోయిందని తెలిపారు. 2024లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో టార్పాలిన్లు కొనుగోలు చేసి ప్రతి రైతు సేవా కేంద్రం (ాఖ)లో బల్క్‌గా నిల్వ ఉంచామని, ఇంతకుముందు వ్యక్తిగతంగా పంపిణీ చేసేవారమని, ఇప్పుడు అవసరమైన రైతులు ాఖల ద్వారా తీసుకుని అవసరం తీరిన తరువాత తిరిగి ఇచ్చే విధానాన్ని అమలు చేస్తున్నామని వివరించారు. వ్యవసాయ రంగంలో సాంకేతికత విస్తృతంగా అభివృద్ధి చెందిందని, ఆధునిక ఎలక్ట్రానిక్ డ్రయర్లు మార్కెట్లో అందుబాటులో ఉన్నప్పటికీ అవి అధిక వ్యయంతో ఉన్నాయని తెలిపారు. పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తో చర్చించి రాష్ట్రంలోని ప్రతి ప్రాంతంలో ఒకటి లేదా రెండు చోట్ల నమూనా ప్రాతిపదికన ఎలక్ట్రానిక్ డ్రయర్లు ఏర్పాటు చేసి, ఫలితాలు అనుకూలంగా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. తడి ధాన్యాన్ని శాస్త్రీయంగా ఎండబెట్టి రైతులకు మెరుగైన ధర లభించేలా చేయడం ప్రభుత్వ లక్ష్యమని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆధునిక డ్రయింగ్ సదు-పాయాలు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

# ఆపన్నహస్తమే జీవితానికి ఆశాకిరణం..

– దివ్యాంగుని సంకల్పానికి కలెక్టర్ లక్ష్మీశ భరోసా!



**విజయవాడ,కలంకౌంటర్ :** ప్రతికూల పరిస్థితులు మనిషిని వెనక్కి నెట్టవచ్చు! కానీ, ధైర్యం, పట్టుదల ఉంటే అదే పరిస్థితులు విజయానికి పునాది కావచ్చు అనే మాటకు ప్రత్యక్ష నిదర్శనం విజయవాడ బోస్‌నగర్ కండ్రికకు చెందిన ఎం. మల్లికార్జున నాయుడుస్వామి. దివ్యాంగుడైనప్పటికీ జీవితంపై నమ్మకం కోల్పోకుండా స్వయం ఉపాధి మార్గాన్ని ఎంచుకున్నారు. చిన్న స్టీల్ దుకాణం ప్రారంభించి, కష్టపడి పనిచేస్తూ బతుకు బండిని లాగిస్తున్నారు. ప్రతిరోజు తన శారీరక ఇబ్బందులను జయిస్తూ కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ఆత్మగౌరవంతో జీవించాలనే ఆయన తపన చుట్టుపక్కల వారికి స్ఫూర్తిగా నిలుస్తోంది. తన వ్యాపారాన్ని మరింత విస్తరించి, స్థిరమైన ఆదాయ వనరుగా మార్చుకోవాలనే లక్ష్యంతో రూ. 5 లక్షల రుణం మంజూరు చేయాలని కోరుతూ బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశను కలిసి వినతి పత్రం అందజేశారు. గతంలో తీసుకున్న ముద్రా రుణాన్ని పూర్తిగా చెల్లించానని, ప్రస్తుతం ఎలాంటి బకాయిలు లేవని వివరించారు. బ్యాంకు రుణం అందితే తన దుకాణాన్ని అభివృద్ధి చేసి మరింత మందికి ఉపాధి అవకాశాలు కల్పించగలనని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్పందించిన జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.. మల్లికార్జున నాయుడు చూపిస్తున్న ఆత్మవిశ్వాసం, స్వయం ఉపాధి పట్ల ఉన్న నిబద్ధతను అభినందించారు. "జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలనే మీ సంకల్పం అభినందనీయం. అవసరమైన విధంగా చేయూత అందించేలా చర్యలు తీసుకుంటాం" అని భరోసా ఇచ్చారు. సమాజంలో అవకాశాల కోసం ఎదురు చూడకుండా, ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ముందుకు సాగాలనే సందేశాన్ని మల్లికార్జున నాయుడుస్వామి జీవితం ఇస్తోంది. ఆపన్నహస్తం అందితే ఆయన కలలు కచ్చితంగా నిజమవుతాయనే ఆశాభావం వ్యక్తమవుతోంది.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com